సాక్షి
జనగామ
గురువారం । 24 । అక్టోబర్ । 2024



బాలికలు క్రీడల్లోనూ రాణించాలి
బాలికలు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు.
- 8లో ▸



టీఎస్ ఐసెట్ నిధుల దుర్వినియోగం?
- 8లో ▸
కేయూ నిర్వహించిన టీఎస్ ఐసెట్ 2024–25లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గరిష్టం/కనిష్టం
31°/19°

వాతావరణం
జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కాంటింజెంట్ వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా హరిప్రసాద్



స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ వ్యాప్తంగా వివిధ పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలో పనిచేస్తున్న కాంటింజెంట్ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మండలంలోని శివునిపల్లికి చెందిన కొలనుపాక హరిప్రసాద్‌ను వరుసగా రెండోసారి నియమించినట్లు తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి బుధవారం తెలిపారు. కాంటింజెన్సీ వర్కర్ల రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి నియమించిన మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ తదితరులకు హరిప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ బీసీ వెల్ఫేర్ కమిటీ



జనగామ: జనగామ ఆర్టీసీ డిపోలో బీసీ వెల్ఫేర్ సంక్షేమ సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. సంఘం డిపో అధ్యక్షుడిగా జీఆర్ లింగం, కార్యదర్శిగా శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు దుర్గయ్య, బాలరాజ్, శ్రీను, శివ, కార్మికులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు నూతన కమిటీకి రాష్ట్ర నాయకులు నియామక పత్రాలు అందించారు.

మెరిట్ జాబితా విడుదల

జనగామ: జనగామ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో 13 కేటగిరీ పరిధిలో ఖాళీగా ఉన్న 50 పోస్టుల భర్తీకి గత నెల ఇచ్చిన నోటిఫికేషన్‌కు సంబంధించి బుధవారం మెరిట్ జాబితా విడుదల చేసినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రావు తెలిపారు. మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం జరిగిందని, దీనిపై అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు తగిన డాక్యుమెంట్లను జత పరుస్తూ రాత పూర్వకంగా వైద్య కళాశాల చాంబర్‌లో అందజేయాలన్నారు. అనంతరం ఫైనల్ లిస్టును ప్రకటిస్తామన్నారు. కాగా డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి సంబంధించి అర్హత సాధించిన అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై పరీక్ష నిర్వహించి, అనుభవజ్ఞులైన వారిని ఎంపిక చేస్తామన్నారు.

ముగ్గురు ఎస్సైల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ కమిషనరేట్ పరిధి ముగ్గురు ఎస్సైలను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎ.శ్వేత తరిగొప్పుల నుంచి సీసీఆర్‌బీ, ఎం.రాజేందర్, ఎ.ప్రవీణ్‌కుమార్‌ను కేయూసీ నుంచి సీసీఆర్‌బీ బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించాలి



దేవరుప్పుల: ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించాలని డీఈఓ కె.రాము సూచించారు. బుధవారం మండలకేంద్రంలోని శ్రీసాయి ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్‌లో ఎస్ఏ1 పరీక్షలను తనిఖీ చేశారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠ్యాంశాలను బోధిస్తూ విద్యార్థుల పురోగతికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తోటకూరి కృష్ణ, ప్రిన్సిపాల్ తోటకూర స్వప్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



జనగామ రూరల్: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని జాయింట్ డైరెక్టరేట్ కమిషనర్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీఎస్ఆర్ రాజేందర్‌సింగ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. పోటీ ప్రపంచంలో వివిధ రకాల పోటీ పరీక్షలకు పకడ్బందీగా ప్రిపేర్ కావాలని, అప్పుడే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. కమిషనర్ దేవసేన విద్యార్థులకు ఎన్నో రకాలైన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏబీవీకి స్వయం ప్రతిపత్తి హోదా రావడం అదృష్టమన్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఉన్న కళాశాల జిల్లాలో ఇదొక్కటే అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

మళ్లీ గుప్పుమంటున్న గుడుంబా..

- బెల్ట్ దుకాణాల్లోనే లభ్యం
- తండాల్లో మొదలైన బట్టీలు
- నల్ల, తెల్ల బెల్లం, పటిక ఎక్కడి నుంచి..?
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు



జనగామ: జిల్లాలో బెల్ట్ దుకాణాలకు తోడు.. గుడుంబా మళ్లీ గుప్పుమంటోంది. ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యంతో మూలకు పడిన బట్టీలు మళ్లీ పురుడు పోసుకుంటున్నాయి. మత్తుకు బానిసలుగా మారిన వేలాది మంది.. కిక్కు కోసం గుడుంబా తాగేస్తున్నారు. జిల్లాలో వందశాతం గుడుంబా నిర్మూలించామని ప్రగల్భాలు పలుకుతున్న ఎక్సైజ్ శాఖకు మండలాలు, తండాల నుంచి వచ్చే వాసన కనిపించడం లేదా అని ప్రజలు నిలదీస్తున్నారు. బెల్ట్ దుకాణాలను నిలువరించలేక చేతులెత్తేసిన ఎక్సైజ్ శాఖ... కనీసం గుడుంబాను అరికట్ట లేని దుస్థితిలో ఉందని ఆయా రాజకీయ పార్టీలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. జిల్లాలో మళ్లీ గుడుంబా అమ్మకాలపై సాక్షి ప్రత్యేక కథనం. గుడుంబాకు కేరాఫ్ అడ్రస్‌గా జనగామ జిల్లా.. ఎక్సైజ్ శాఖ ఉక్కు పాదంతో సైలెంట్ అయిపోయింది. గత ప్రభుత్వం గుడుంబాపై ఆధార పడిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందించింది భరోసా కల్పించింది. మరోసారి గుడుంబా తయారీ, అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు సైతం తీసుకుంటామని హెచ్చరించారు. గడిచిన రెండేళ్ల పాటు గుడుంబా తయారీ నిలిచి పోవడంతో అమ్మకాలు కూడా పెద్దగా కనిపించలేదు. దీంతో మద్యం అమ్మకాలు ఒక్కసారిగా పెరగడంతో సర్కారు ఖజానాకు పెద్ద ఎత్తున ఆదాయం పెరిగింది.



తరిగొప్పుల మండలంలో గుడుంబా బట్టీలు

బెల్లం, పటిక ఎక్కడి నుంచి?

గతంలో నల్ల బెల్లం, పటిక అమ్మకాలు నిలిచి పోయినప్పటికీ.. మళ్లీ ఈ వ్యాపారం ఊపందుకుంటోంది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తికి హైదరాబాద్, హనుమకొండ, తిర్మలగిరి తదితర ప్రాంతాల నుంచి ఈ సరుకులు వస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. బెల్లం, పటిక రవాణాను ఆపలేని ఎక్సైజ్ శాఖ ఒక రకంగా ఊర్లలో మద్యం, గుడుంబాను పెంచి పోషిస్తుందని పలువురు అంటున్నారు. అనధికారికంగా బెల్ట్ దుకాణాలకు ఎక్సైజ్ శాఖ రాజముద్ర వేసిందనే ఆరోపణలు నేపథ్యంలో.. కొంతమంది పనిలో పనిగా గుడుంబా విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది.

గుడుంబా తయారీకి అలవాటు పడిన కొంత మంది హనుమకొండ, జనగామ, భువనగిరి తదితర ప్రాంతాల నుంచి నల్ల, తెల్ల బెల్లం, పటిక తీసుకువచ్చి మళ్లీ తయారు చేయడం మొదలు పెట్టారు. చిల్పూరు మండలం శ్రీపతిపల్లి, లింగంపల్లి, ఫతేపూర్, తరిగొప్పుల మండలంలోని బొత్తలపర్రె, దూల్మిట్ట మండలం కూటిగల్‌లోని గిరిజన తండాల్లో గుడుంబా తయారు చేసి, మండల కేంద్రం, అంకుశాపూర్, నర్సాపూర్, అక్కరాజుపల్లి, పోతారం, సోలీపూర్, బొంతగట్టు నాగారం గ్రామాలకు సరఫరా చేస్తున్నా.. ఎక్సైజ్ శాఖ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. ఏది ఏమైన గుడుంబా మహమ్మారి మళ్లీ పేద కుటుంబాల్లో అగ్గి రాజేస్తుందని ఆందోళన చెందుతున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి



పాలకుర్తి మండలంలోని పలు గిరిజన తండాల్లో గుడుంబా తయారు చేసి ఆయా గ్రామాలకు సప్లయ్ చేస్తున్నారు. ప్రభుత్వం గుడుంబాను నిషేధించినా, ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ లేక పోవడంతో మళ్లీ పురుడు పోసుకుంటోంది.

\- యతిపతి శ్రీకాంత్, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, పాలకుర్తి

విక్రయాలు ఆపేదెవరు?



ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యంతో గుడుంబా తయారీ, అమ్మకాలు అడ్డూఅదుపు లేకుండా సాగుతుంది. తరిగొప్పుల మండలంలో విచ్చలవిడిగా తయారు చేసి పలు గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. గుడుంబా విక్రయాలను నిలిపేయాలి.

\- ఆవుల శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు, తరిగొప్పుల

విక్రయాలను అరికట్టాలి..



స్టేషన్‌ఘన్‌పూర్ మండలానికి చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాల నుంచి గుడుంబా సప్లయ్ చేస్తున్నారు. దుకాణాల్లో నల్ల బెల్లం విక్రయాలు నిలిపేయాలి. ప్రజల ప్రాణాలకు భద్రత లేదు. ఎక్సైజ్ శాఖ నిద్రమత్తు విడువని పక్షంలో పరిస్థితి చేదాటి పోతుంది.

\- మారేపల్లి ప్రసాద్, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు, స్టేషన్‌ఘన్‌పూర్

ప్రతీ నీటి బొట్టును ఒడిసిపట్టాలి

- కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ శుభోత్‌యాదవ్ ఐఏఎస్



సాగు భూములను పరిశీలిస్తున్న శుభోత్‌యాదవ్, అధికారులు

బచ్చన్నపేట: భూగర్భ జలాల పెంపునకు ప్రతీ నీటి బొట్టును ఒడిసి పట్టాలని కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ శుభోత్‌యాదవ్ ఐఏఎస్ అన్నారు. బుధవారం మండలంలోని గంగాపూర్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో పలువురు బృంద సభ్యులతో కలిసి పర్యటించారు. గ్రామాల్లో నిర్మించిన ఇంకుడు గుంతలు, చెక్ డ్యాంలను కేంద్ర భూగర్భ జల బోర్డు (దక్షిణ ప్రాంత) రీజినల్ డైరెక్టర్ కృష్ణమూర్తితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామల్లో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో భూగర్భ జలాల పెంపునకు మండలంలోని గంగాపూర్, నాగిరెడ్డిపల్లి, పడమటికేశ్వాపూర్ గ్రామాలను ఎంపిక చేసి వాప్‌కో సంస్థ వారు 8 ఫీజో బోర్లు వేసి అందులో చిప్స్‌ను బిగించారని, ఆ చిప్స్ ద్వారా ఢిల్లీలోని ల్యాబ్‌లో నీటి మట్టం పెరుగుదల, తగ్గుదలను తెలుసుకోవచ్చన్నారు. జిల్లాలో భూగర్భ జల చెక్ డ్యాంల ఏర్పాటుకు ప్రణాళికలు పంపిస్తే పరిశీలించి తక్షణమే నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రీజినల్ డైరెక్టర్ ద్వివేది, అడ్వైస్, డీఆర్‌డీఓ ఎన్.వసంత, క్లస్టర్ టీపీ కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జున్, ఏపీఓ కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ భాను, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, బందారం సుశీల, గ్రామస్తులు పాల్గొన్నారు.

పన్నులు వసూలు చేయాలి

- డీపీఓ స్వరూప



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ స్వరూప

కొడకండ్ల: ఈ నెలాఖరు కల్లా ఇంటి, నల్లా పన్నులు వందశాతం వసూలు చేయాలని డీపీఓ స్వరూప ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో వందశాతం పన్నుల వసూలే లక్ష్యంగా ముందుకు సాగాలని, వ్యాపారస్తులకు ట్రేడ్ లైసెన్స్‌లు ఇవ్వాలని, లైసెన్స్ తీసుకోని షాపులను సీజ్ చేయాలన్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జీపీకి సంబంధించిన రిజిస్టర్‌లతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధిహామీ పనుల రిజిస్టర్‌లను అప్‌డేట్ చేయాలని కార్యదర్శి, ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి, ఎంపీఓ ఇందిర, ఏపీఓ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ కాటన్ యార్డులో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు సెంటర్‌ను ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సెంటర్‌కు ధాన్యం తీసుకు వచ్చే సమయంలో నాణ్యతను పాటిస్తే మద్దతు ధర వస్తుందన్నారు. కొనుగోలు సెంటర్‌లో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ నరేంద్ర, మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, ఏపీఎం ఇందిర, సీసీ శంకర్, పీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి నరసింహులు, డైరెక్టర్లు మోహన్, నరసింహారావు, శ్రీలతరెడ్డి, శ్రీనివాస్, బన్సీ, కొండల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివరాజ్

సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గోదాముల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత, మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, ఏపీఎం నాగేశ్వర్‌రావు, వెంకటాచారి, విద్యానాథ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాల అనుమతికి దరఖాస్తు చేసుకోండి

- డీసీపీ రాజమహేంద్ర నాయక్

జనగామ: దీపావళి పండుగ నేపథ్యంలో సీపీ ఆదేశాల మేరకు జిల్లాలో బాణసంచా అమ్మకాలకు ముందస్తు అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని డీసీపీ రాజమహేంద్ర నాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని హనుమకొండ రోడ్డు ఏసీపీ కార్యాలయ ఆవరణలో బుధవారం హోల్‌సేల్, రిటైల్ దుకాణ, గోడౌన్ ఓనర్లతో జరిగిన సమావేశంలో డీసీపీ పాల్గొని మాట్లాడారు. పండుగను పురస్కరించుకుని తాత్కాలిక బాణసంచా అమ్మకాల అనుమతికి ఆసక్తి గల వ్యక్తులు దరఖాస్తు ఫారంతో అగ్నిమాపక విభాగం అధికారులు జారీ చేసిన ఎన్ఓసీ, ప్రైవేట్ ప్రదేశాలకు సంబంధించి స్థల యజమాని, ప్రభుత్వ స్థలాల్లో సదరు అధికారి, ఇంటి పక్కన వారి అనుమతి పత్రాలను సమర్పించాలన్నారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం బాణాసంచా అమ్మకాలకు అనుమతులు జారీ చేయడం జరుగుతుందన్నారు. అగ్నిమాక శాఖ డీఎఫ్ఓ రేమండ్ బాబు, ఇన్‌చార్జ్ ఎస్ఐ సీహెచ్ శ్రీరాములు మాట్లాడుతూ బాణసంచా అమ్మకాల సమయంలో యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకొని, ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీలు పార్థసారథి, భీమ్ శర్మ, సీఐలు దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అబ్బయ్య, వేణు, ఎస్సైలు రాజేష్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

వైభవంగా ఆరుద్రోత్సవం



సోమేశ్వర స్వామి ఆలయంలో దీపోత్సవం

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమేశ్వరస్వామికి ×ఆరుద్రోత్సవం× వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి 108 లీటర్ల ఆవుపాలతో ఏకాదశ రుద్రాభిషేకం, గర్భాలయం దీపోత్సవం, పుష్పాలంకరణ, విశేష నిరాజనం, మంత్రపుష్పం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామదాసు భజన మండలి ఆధ్వర్యంలో భజనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, ఆలయ అర్చకులు, డీవీఆర్‌శర్మ, అనిల్‌కుమార్, నాగరాజు, ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్ : టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. జాతీయ సాధన సర్వేలో జిల్లాకి మంచి ర్యాంక్ వచ్చేలా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఓరియంటేషన్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా పాల్గొని మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలోని అన్ని విద్యాసంస్థల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విజయోస్తు కార్యక్రమాన్ని రూపకల్పన చేశామని, దీని ద్వారా ప్రత్యేక ప్రణాళిక ద్వారా ఉపాధ్యాయులు ముందుకు పోవాలన్నారు. ఆ దిశగా హెచ్‌ఎంలు, ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నవంబర్ 1వతేదీ నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, డిసెంబర్ నెలాఖరు వరకు సిలబస్ పూర్తి కావాలన్నారు. వెనకబడిన విద్యార్థులను ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు అడప్షన్ తీసుకుని ఏ సబ్జెక్టులో వీక్ ఉన్నారో దానిపై ప్రత్యేక తీసుకోవాలన్నారు. జాతీయ సాధన సర్వే పరీక్షలో విద్యార్థులు మంచి ప్రతిభ చూపించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కె.రాము, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్ రవికుమార్, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ జి.చంద్ర భాను, ప్లానింగ్ కోఆర్డినేటర్ టి.రాజు, బి.శ్రీనివాస్, గౌసియా, రామరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

అన్ని సామాజిక వర్గాల విశ్లేషణ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. బుధవారం హైదారాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయం నుంచి కమిషన్ కార్యదర్శి బాలమాయ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ రెండో తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ కలెక్టరేట్‌లో పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు పాల్గొనేలా చూడాలని, అందుకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. గ్రామాల్లో సామాజిక ఆర్థిక సర్వే విశ్లేషణపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమాధికారి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన అవసరం

జనగామ: నివాస గృహాలతో పాటు వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్ అన్నారు. యశ్వంతాపూర్ క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సీఎండీ ఆదేశాల మేరకు విద్యుత్ ప్రమాదాలు, నివారణపై జరిగిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఇంట్లో విద్యుత్ వైర్లు తెగిపడిన సమయంలో ఎలా స్పందించాలనే దానిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ లక్ష్మినారాయణ, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ వేణుమాధవ్

అరకోటికి పైగా శఠగోపం

- పాలకుర్తి సోమేశ్వరాలయ వేలంపాటదారుల నిర్వాకం
- బినామీ పేర్లతో మళ్లీ మళ్లీ టెండర్లు
- ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే..
- రూ.54,16,505 దాటిన మొండి బకాయిలు
- చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్న అధికారులు



సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం గుట్ట

పాలకుర్తి టౌన్: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానానికి దేశవ్యాప్తంగా గుర్తింపు ఉంది. సోమేశ్వర స్వామికి కొందరు కాంట్రాక్టర్లు ఎగనామం పెడుతున్నారు. దేవాలయ టెండర్లు దక్కించుకొని సదరు సొమ్ములు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నారు. మరికొందరు బినామీ పేర్లతో టెండర్ల వేసి అక్రమ దందాకు తెరలేపుతున్నారు. సుమారు అర కోటికి పైగా బకాయిలు పెట్టారు. ఆలయంలో కొబ్బరికాయలు, పూజాసామగ్రి, తలనీలాలు, కొబ్బరి ముక్కలకు సంబంధించిన వేలం పాటల్లో కాంట్రాక్టర్లు పోటీ పడి టెండర్ల దక్కించుకుంటున్నారు. అదేస్థాయిలో లాభాలు కూడా అర్జిస్తున్నారు. లాభనష్టాలతో సంబంధం లేకుండా వేలం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదు. పాత బకాయిలు చెల్లించకుండానే బినామీ పేర్లతో మళ్లీ టెండర్ దాఖలు చేస్తున్నారు. 2008 నుంచి 2023 వరకు 12 మంది కొబ్బరికాయలు, పూజ సామగ్రి పేరుతో టెండర్లు పొంది రూ.43,89,905 లక్షలు బకాయి పడ్డారు. 2008 నుంచి 2017 వరకు ఐదుగురు వ్యక్తులు తలనీలాలు పోగు చేసుకునేందుకు వేలం పాడి రూ.7.36 లక్షలు చెల్లించలేదు. 2012 నుంచి 2022 వరకు కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కు పొందిన నలుగురు వ్యక్తులు రూ.2.90 లక్షలు చెల్లించాల్సి ఉంది. 2008 నుంచి ఇప్పటి వరకు మొత్తం రూ.43,89,905 లక్షలు బకాయిలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. దేవాలయ ఆదాయానికి గండి కొట్టిన వ్యక్తులే తెలంగాణలోని ఇతర జిల్లాలో కూడా వేలం పాటల ద్వారా టెండర్లు పొంది వ్యాపారాలు చేస్తున్నట్లు సమాచారం. పదిహేను సంవత్సరాల నుంచి బకాయిలు చెల్లించకుండానే పాతుకు పోయిన కాంట్రాక్ట్‌దారులు సోమేశ్వరాలయంలో తిరిగి టెండర్లను కూడా కైవసం చేసుకుంటున్న పరిస్థితి ఇప్పటికీ కూడా కొనసాగుతుంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు పెండింగ్ బకాయిలు లేకుండా తగిన చర్యలు తీసుకొని దేవాలయ అభివృద్ధికి పాటు పడాలని భక్తులు కోరుతున్నారు.

చర్యలు తప్పవు..



సోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి ఆలయానికి 16 ఏళ్లుగా టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు బకాయి డబ్బులు చెల్లించడం లేదు. ఇప్పటి వరకు అర కోటి పైగానే బకాయిలు ఉన్నాయి. ఆ డబ్బులు చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వారిని బ్లాక్ లిస్టులో పెడతాం.

\- ఎస్.మోహన్‌బాబు, ఈఓ, పాలకుర్తి దేవస్థానం

బకాయిదారుల వివరాలు

బకాయిదారులు	చెల్లించాల్సిన బకాయిలు(రూ.ల్లో)
తాటిచెట్టు ఉపేందర్	1,70,500
కాశీ ఓంకార్	1,25,500
పొన్నం రణధీర్	1,30,000
చిదురాల శంకర్	36,000
జీడీ సోమేశ్వర్	25,300
కత్తి దస్తగిరి	80,105
పేరబోయిన పెంటయ్య	4,67,000
పుట్ట ఉమ	6,06,000
దాసరి నర్సయ్య	9,080,000
ఇల్లందుల హరీశ్	10,85,500
గోనెల మురళి	5,26,000
శ్రీపాదసదం రాములు	1,00,000
తాళ్ల సోమనారాయణ	40,000
తాళ్ల అంజమ్మ	1,45,000
తాళ్ల సోమనారాయణ	1,40,000
పెనుగొండ అంజనేయులు	3,11,000
నల్ల సూజాత	41,1000
మన్నూరు రాంమూర్తి	1,06,500
వీరదుర్గ వరప్రసాద్	1,36,000
కుక్కల వేమన్న	1,58,000
మొత్తం	54,16,505

క్లుప్తంగా

35 నిమిషాలు ఆగిన శాతవాహన



● విద్యుత్ సరఫరాలో సాంకేతిక లోపం

మహబూబాబాద్ రూరల్: విజయవాడ నుంచి సికింద్రాబాద్ వెళ్లే శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు రెండు గుట్టల సమీపాన ఆగింది. దీంతో ప్రయాణికులు ఏం జరిగిందోనని రైలుదిగి వెళ్లి లోకో పైలట్, సిబ్బందిని అడిగారు. ఈ విషయంపై రైల్వే అధికారులను వివరణ కోరగా రైలు మహబూబాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి రైలు రెండు గుట్టల సమీపానికి చేరుకున్నాక అకస్మాత్తుగా ఓహెచ్ఈ విద్యుత్ సరఫరాలో సాంకేతిక లోపం తలెత్తి 9.03 గంటలకు రైలు నిలిచిపోయిందన్నారు. లోకో పైలట్, సిబ్బంది సకాలంలో స్పందించి మరమ్మతులు చేశాక 9.38 గంటలకు రైలు వెళ్లిపోయిందని మహబూబాబాద్ రైల్వే స్టేషన్ సూపరిండెంటెంట్ కనకరాజు తెలిపారు.

నేడు కోణార్క్, హౌరా రైళ్లు రద్దు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే కోణార్క్, హౌరా ఎక్స్‌ప్రెస్‌లు వర్షాల కారణంగా గురువారం రద్దు అయినట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. భువనేశ్వర్–ముంబాయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్, హౌరా–హైదరాబాద్ (185046) హౌరా ఎక్స్‌ప్రెస్ రద్దు అయినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

వనదేవతల ఆదాయం రూ.26,81,640

మేడారం హుండీ కానుకలు లెక్కింపు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మల హుండీల కానుకలను బుధవారం దేవాదాయశాఖ అధికారులు లెక్కించారు. మేడారంలోని డార్మెటరీ భవనంలో పూజారుల సమక్షంలో హుండీల కానుకలను లెక్కించారు. సమ్మక్క హుండీ ఆదాయం రూ. 13,85,398, సారలమ్మ ఆదాయం రూ. 12, 09,392, పగిడిద్దరాజు ఆదాయం రూ. 47, 331, గోవిందరాజుల ఆదాయం రూ. 39, 519.. మొత్తం రూ.26,81,640 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ రాజేంద్రం తెలిపారు. గతంలో హుండీల కానుకల ఆదాయం పోల్చుకుంటే ఈసారి సగం ఆదాయం తగ్గింది. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఇన్‌స్పెక్టర్ కవిత, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, జూనియర్ అసిస్టెంట్లు రాజేశ్వర్‌రావు, జగదీశ్, మధు, వీరన్న, బాలకృష్ణ, పూజారులు సిద్ధబోయిన మునిందర్, కొక్కెర కృష్ణ, చందా రఘుపతి, కాక సారయ్య, కాక కిరణ్, గోవర్ధన్, సిద్ధబోయిన స్వామి, భోజరావు, దశరథం, రమేశ్ పాల్గొన్నారు.

టీఎస్ ఐసెట్ నిధుల దుర్వినియోగం?

● రూ.99.50 లక్షలకు ప్రతిపాదనలు..
● రూ 92.76 లక్షల నిధుల కేటాయింపు
● సొంత అకౌంట్‌లోకి నగదు బదిలీపై ఆరోపణలు



కేయూ క్యాంపస్: కేయూ నిర్వహించిన టీఎస్ ఐసెట్ 2024–25లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐసెట్ కన్వీనర్‌గా కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యులు నర్సింహాచారిని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నియమించింది. ఇందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి కేటాయించిన నిధులు కొంత మేరకు దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి. విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి.

నిర్వహణకు భారీగా నిధులు

ఐసెట్ నిర్వహణ, తదితర ఖర్చుల కోసం ఐసెట్ కన్వీనర్ రూ.99.50 లక్షలు రాష్ట్ర ఉన్నత విద్యామండలికి ప్రతిపాదించారు. రూ.92.76 లక్షలు కేటాయింపు జరిగింది. అనంతరం కన్వీనర్ అకౌంట్‌లోకి దశలవారీగా నిధులు విడుదల చేసినట్లు సమాచారం. ఐసెట్ నిర్వహణ, పేపర్ సెట్టింగ్, ప్రశ్నపత్రాల రూపకల్పన తదితరాల కోసం ఆయా బిల్లులను కన్వీనర్ అకౌంట్‌లోని డబ్బుల నుంచే ఆన్‌లైన్‌లో లేదా చెక్కుల రూపంలో చెల్లించాలి. కేయూలోని ఐసెట్ కార్యాలయంలో ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరికి కూడా ప్రతినెల నిధుల నుంచే చెల్లించాల్సి ఉంటుంది.

వ్యక్తిగత ఖాతాలోకి రూ.29 లక్షలు

టీఎస్ ఐసెట్ కన్వీనర్ అకౌంట్‌లో నుంచి పలు దఫాలుగా సుమారు రూ.29.25 లక్షల వరకు తన వ్యక్తిగత ఖాతాలోకి (బ్యాంక్ అకౌంట్)కు బదిలీ చేసుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొంత మొత్తం సెల్ఫ్ చెక్కులతో విడుదల చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. అదేవిధంగా కన్వీనర్ అకౌంట్ నుంచి ఐసెట్ కార్యాలయంలో పని చేసే తాత్కాలిక ఉద్యోగి అకౌంట్‌లోకి పలు దఫాలుగా సుమారు రూ.11 లక్షల వరకు బదిలీ చేశారని ఆరోపణలున్నాయి. వర్సిటీలో పని చేయని ఓ మహిళ అకౌంట్‌లోకి సైతం రూ 82,600లు బదిలీ చేశారనే ఆరోపణలున్నాయి. కన్వీనర్ అకౌంట్‌లో నుంచే వ్యయాలకు వెచ్చించాల్సి ఉండగా.. వ్యక్తిగత బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేయడంపై అంతర్యమేంటనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పర్చేజ్ కమిటీ అప్రూవల్ లేకుండానే ఐదు కంప్యూటర్లు కొన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రూ 4.37 లక్షల వరకు వ్యయం చేశారని తెలుస్తోంది. కన్వీనర్‌గా రూ.13 వేలు మాత్రమే మిగులు చూపినట్లు తెలుస్తోంది.

ఉన్నత విద్యా మండలికి ఫిర్యాదు

ఐసెట్ నిర్వహణకు కేటాయించిన నిధుల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి ఫిర్యాదు అందినట్లు సమాచారం. ఉన్నత విద్యామండలి టీఎస్ ఐసెట్ నిర్వహణకు సంబంధించి కేటాయించిన నిధులు ఎలా వెచ్చించారనేదానిపై విచారణ జరిపే అవకాశాలున్నట్లు తెలిసింది. ఉన్నత విద్యా మండలిలో సమర్పించిన బిల్లులు ఆడిట్ రిపోర్టు కూడా పరిశీలించనున్నట్లు సమాచారం.

అవకతవకలకు పాల్పడలేదు

టీఎస్ ఐసెట్–24 నిర్వహణకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి నుంచి కేటాయించిన నిధుల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కేటాయించిన నిధుల్లో నిర్వహణ వివిధ రకాలుగా వ్యయంతో పాటు కాన్ఫిడెన్షియల్ వ్యయం తన రెమ్యూనరేషన్ రూ.లక్ష 25 వేలు, గత వీసీకి రూ. 2 లక్షలు, అప్పటి ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు రూ. 2 లక్షలు వైస్ చైర్మన్లకు ఇద్దరికి చేరో రూ. 2 లక్షల చొప్పున రెమ్యూనరేషన్ చెల్లించా. వ్యక్తిగత ఖాతాకు ఎందుకు బదిలీచేశానంటే కొన్ని రకాల ఖర్చులకు నగదు రూపంలో కూడా చెల్లించాల్సి వచ్చింది. నిధుల కేటాయింపులో చేసిన వ్యయంపై బిల్లులపై కూడా ఆడిట్ జరిగింది. అందుకు సంబంధించి బిల్లులు ఆడిట్ రిపోర్టును కూడా రాష్ట్ర ఉన్నత విద్యామండలికి ఇప్పటికే సమర్పించా.

\- ఆచార్య నర్సింహాచారి, టీఎస్‌ఐసెట్ కన్వీనర్

చర్యలు తీసుకుంటాం

కేయూ ఐసెట్ కన్వీనర్‌కు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కేటాయించిన నిధుల వ్యయంపై ఉన్నత విద్యా మండలి బిల్లులను పరిశీలించాల్సి ఉంటుంది. ఈ వ్యవహారం నా పరిధిలో లేదు. నేను ఇటీవలే వీసీగా బాధ్యతలు స్వీకరించా. నిర్వహణ వ్యయంలో కన్వీనర్ ఏమైనా అవతవకలకు పాల్పడినట్లు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తేల్చితే అప్పుడు నేను సంబంధిత కన్వీనర్‌గా ఉన్న ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకుంటా.

\- ప్రతాప్‌రెడ్డి, వీసీ, కాకతీయ యూనివర్సిటీ

దాతలు.. దయచూపండి

చేతులెత్తి వేడుకుంటున్న కమలమ్మ
● పోలియో బారిన పడిన మనవరాలు
● కష్టమవుతున్న కుటుంబ పోషణ
● పట్టించుకోని కుమారుడు.. ఇల్లు కూడా సరిగా లేని దుస్థితి
● గుడిసెలోనే కాలం వెళ్లదీస్తున్న వృద్ధురాలు
● దయార్ధహృదయులు, ప్రభుత్వం పట్టించుకోవాలని విజ్ఞప్తి



పౌర్ణమి కుటుంబం, తను ఉంటున్న గుడిసె

గోవిందరావుపేట : అసలే పేద కుటుంబం.. ఆపై ఉండడానికి కూడా ఇల్లు లేని దుస్థితి. ఉన్న అర గుంట స్థలంలో చిన్న గుడిసె. ఆ గుడిసెలోనే కాలం వెళ్లదీస్తూ 30 సంవత్సరాలు కూలి పని చేసుకుంటూ కొడుకులను పోషించుకుంది. ఇద్దరు కొడుకులకు పెళ్లిళ్లు అయ్యాయి. ఇక్కడే విధి వెంటాడడం మొదలు పెట్టింది. చిన్న కొడుకుకు సంతానం కలిగిన తర్వాత కొద్ది రోజులకే చిన్న కోడలు చనిపోయింది. అప్పటికే ఆ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు. ఆ కూతుళ్లలో ఒకరు పుట్టుకతోనే పోలియో బారినపడింది. కొడుకు మద్యానికి బానిసయ్యాడు.. అది సరిపోదు అన్నట్లు అతడికి మూర్ఛ రోగం.. ఆ తల్లికి కూడా వయసు మీద పడింది. దీంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారి దాతలు, ప్రభుత్వ సాయం కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తోంది. ఆ వృద్ధురాలే మండలంలోని చల్వాయికి చెందిన కార్పాటి కమలమ్మ. పోలియో బారిన పడిన చిన్నారి పేరు 'పౌర్ణమి'. ఆ చిన్నారికి పేరు తెలిసి పెట్టారో, తెలియక పెట్టారో తెలియదు కానీ పేరులో ఉన్న వెలుగు జీవితంలో లేదు.. వివరాల్లోకి వెళ్తే.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయికి చెందిన పౌర్ణమికి పుట్టినప్పుడే పోలియో వచ్చింది. కొద్ది రోజులకే తల్లి చనిపోయింది. తండ్రి తన బాధ్యత మరచి పోయాడు. దీంతో పౌర్ణమి మంచిచెడులను నానమ్మ కమలమ్మ, చెల్లి జ్యోతి చూసుకుంటోంది. అసలే వృద్ధురాలు.. ఆపై ఎలాంటి ఆసరా లేని దుస్థితి. ఫలితంగా పూట గడవడం కష్టతరంగా మారింది. అర్ధాకలితో కుటుంబం మొత్తం అలమటిస్తోంది.

వైద్య ఖర్చులకూ సరిపోని పింఛన్..

ఆ వృద్ధురాలికి వచ్చే ఆసరా పింఛన్ కుటుంబం పోషణ పక్కన పెడితే వైద్య ఖర్చులకూ సరిపోవడం లేదు. నెలనెలా పౌర్ణమి బాగోగులతోపాటు తన వైద్యానికి ఖర్చు చాలా అవుతోందని కమలమ్మ కన్నీరుమున్నీరవుతోంది. కమలమ్మ గుడిసె చుట్టూ చెట్లు, పొలాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఓ రోజు నిద్రిస్తున్న సమయంలో కమలమ్మను పాము కాటు వేసింది. వైద్యుడి వద్దకు వెళ్తామంటే చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో నిర్లక్ష్యం చేసింది. దీంతో ఇన్‌ఫెక్షన్ అయ్యింది. చికిత్స చేయించుకుంటూ మందులు వాడుతోంది. ఫలితంగా వచ్చే పింఛన్ వైద్యానికే ఖర్చు చేస్తుడడంతో కుటుంబం గడవడం లేదు. దీనిపై దాతలు, ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయంతోపాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆ వృద్ధురాలు చేయెత్తి వేడుకుంటోంది. దాతలు, ప్రభుత్వం.. 6281288143 ఈనంబర్‌ను సంప్రదించి చేయూత ఇవ్వాలని కమలమ్మ విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, గత ప్రభుత్వంలో చల్వాయి గ్రామానికి 40 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరయ్యాయి. అయితే కమలమ్మ లాంటి పేదలకు ఇవ్వకుండా ఇప్పటికే ఇల్లు ఉన్నవారితోపాటు ప్రభుత్వ ఉద్యోగ కుటుంబాలకు డబుల్ ఇళ్లు కేటాయించారని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు.

గుండె తరుక్కుపోతోంది



కమలమ్మ కుటుంబాన్ని చూస్తే గుండె తరుక్కుపోతోంది. ఇల్లు లేదు. పౌర్ణమి పుట్టుకతోనే పోలియో బారిన పడింది. తల్లి చనిపోయింది. తండ్రికి మూర్ఛ రోగం. నానమ్మకు వయసు మీద పడింది. ఇలాంటి నిరుపేదలకు ప్రభుత్వం ఆదుకోవాలి. గత ప్రభుత్వంలో గ్రామంలో అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేశారు. ఈ ప్రభుత్వంలోనైనా ఈ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి.

\-గణపాక సుధాకర్, చల్వాయి

వారసత్వ కట్టడాల పరిరక్షణకు కృషి చేయాలి



వేదకుమార్‌కు మెమొంటో అందిస్తున్న ప్రొఫెసర్ పాండురంగారావు

వెంకటాపురం(ఎం) : వారసత్వ కట్టడాల పరిరక్షణకు వలంటీర్లు కృషి చేయాలని డెక్కన్ హెరిటేజ్ అకాడమీ అండ్ ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం.వేదకుమార్ పిలుపునిచ్చారు. రామప్పలో కొనసాగుతున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ల క్యాంపు బుధవారం 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వలంటీర్లనుద్దేశించి వేదకుమార్ మాట్లాడారు. పురాతన కట్టడాలు, సంస్కృతిని రక్షించుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా వేదకుమార్‌కు ప్రొఫెసర్ పాండురంగారావు మెమొంటో అందించారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు శ్రీధర్‌రావు, శ్రీనివాస్, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, గైడ్‌లు గోరంటాల విజయ్‌కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బాలికలు క్రీడల్లోనూ రాణించాలి

● హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య
● ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కమలాపూర్: బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కమలాపూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎంజేపీ గురుకుల పాఠశాలల అండర్–17 బాలికల క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. స్థానిక విద్యార్థినులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించగా క్రీడాకారిణులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని 18 పాఠశాలలకు చెందిన 630 మంది విద్యార్థినులు పాల్గొనడం సంతోషకరమని, అందరూ క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. బాలికలు క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాకారిణులతో కలిసి వాలీబాల్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. అంతకుముందు వరంగల్‌కు చెందిన విద్యార్థినులు యోగాసనాలతో ఆకట్టుకోగా, వర్ధన్నపేట, తిమ్మాపూర్, గాంధీనగర్‌కు చెందిన విద్యార్థినులు నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి, తహసీల్దార్ సురేశ్, ఎంపీడీఓ గుండె బాబు, ఎంజేపీ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ వెంకటప్రసాద్, ప్రిన్సిపాల్స్ సౌజన్య, రవీందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డివిజన్‌తోనే సమస్యల పరిష్కారం

● వరంగల్ ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
● నేడు రైల్వే జీఎంతో ఎంపీల సమావేశం



రైల్వే సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ రైల్వే డివిజన్ కేంద్రం అయితేనే.. రైల్వే సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. అయోధ్యపురం వద్ద జరుగుతున్న రైల్వే వ్యాగన్ పీఓహెచ్ షెడ్‌ను బుధవారం సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కాజీపేట జంక్షన్‌కు చేరుకుని రైల్వే సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ కాజీపేటలో రైల్వే ప్లాట్‌ఫామ్‌ల సంఖ్య పెంచాలని, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. నష్కల్–హసన్‌పర్తి వరకు ధర్మసాగర్ బైపాస్ లైన్ పరిశీలనలో ఉందని, రైతుల భూమిలో నుంచి రైల్వే లైన్ వెళ్తే పరిహారం వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాజీపేట జంక్షన్ పరిధిలో నెలకొన్న రైల్వే సమస్యలను గురువారం సికింద్రాబాద్‌లో రైల్వే జనరల్ మేనేజర్‌తో జరిగే ఎంపీల భేటీలో ప్రస్తావించి పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామన్నారు. నెల రోజుల్లో కాజీపేట ఫాతిమా బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు పెట్టి ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైల్వే అధికారులు బద్దియ, రామకృష్ణ రాజు, విజయ్‌కుమార్, సజ్జన్‌లాల్, రాజేశ్, మౌనిక, కార్పొరేటర్లు జక్కుల రవీందర్‌యాదవ్, విజయశ్రీరజాలి, మాజీ కార్పొరేటర్లు అబుబక్కర్, గుంటి కుమార్, నాయకులు అజ్గర్, సిరిల్ పాల్గొన్నారు.

టెక్నాలజీ కోర్సుల్లో శిక్షణ

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని గిరిజన బాల, బాలికలకు వివిధ టెక్నాలజీ కోర్సుల్లో ప్రత్యేక శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సైదామాలోత్ బుధవారం తెలిపారు. ఐటీడీఏ ఏటూరునాగరం ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని పదో తరగతి పాస్ అయిన గిరిజన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో 2024– 25 విద్యా సంవత్సరానికి గాను మ్యాన్‌ఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డీజిల్ మ్యాన్‌ఫాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టిజన్ యుజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్, వర్చుల్ వెరిఫైర్, అడ్వాన్స్‌డ్ సియన్‌సి మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్స్, తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 25న జిల్లా కేంద్రంలోని గిరిజన భవనంలో, 26న ములుగు జిల్లా గిరిజన భవనంలో ప్రవేశాలకు ఎంపిక ఉంటుందన్నారు. శిక్షణ తర్వాత టాటా కంపెనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తారని, ఆసక్తి గల గిరిజన బాల, బాలికలు పదో తరగతి పాస్ మెమో, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, టీసీ, ఒరిజినల్, జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలన్నారు. వివరాలకు జిల్లా గిరిజన సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా బస్సులు నడపాలి

● ఆర్టీసీ కరీంనగర్ ఈడీ, కార్పొరేషన్ కార్యదర్శి పీవీ మునిశేఖర్



స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఈడీ మునిశేఖర్

హన్మకొండ: ప్రణాళికబద్ధంగా బస్సులు నడపాలని టీజీఎస్ ఆర్టీసీ కరీంనగర్ ఈడీ, కార్పొరేషన్ కార్యదర్శి పీవీ మునిశేఖర్ అధికారులకు సూచించారు. బుధవారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కరీంనగర్ జోన్ పరిధి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్లు, డిప్యూటీ మేనేజర్ల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ జోన్ పరిధి ప్రతీ డిపో లాభాల్లో ఉండాలని, ఆ దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం..

ఆర్టీసీ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు వరంగల్ రీజియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను రీజినల్ మేనేజర్ డి.విజయభానుతో కలిసి ఈడీ ప్రారంభించారు. సాంకేతిక మార్పులకు అనుగుణంగా శిక్షణ ఇచ్చేందుకు ఈ శిక్షణ కేంద్రం దోహదపడుతుందన్నారు.

ఆర్టీసీ ఐటీఐలో అత్యుత్తమ శిక్షణ

టీజీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐటీఐలో అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నట్లు ఈడీ మునిశేఖర్ అన్నారు. వరంగల్ ములుగు రోడ్డులోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో డీజిల్ మెకానిక్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. ఆర్టీసీ ఐటీఐలో డీజిల్ మెకానిక్ చదివిన 40 మంది విద్యార్థుల్లో 10 మందికి ప్రధానమైన కంపెనీల్లో ప్లేస్‌మెంట్ లభించిందన్నారు. వరంగల్ రీజనల్ మేనేజర్ డి.విజయభాను, కరీంనగర్ ఆర్ఎం సుచరిత, ఖమ్మం ఆర్ఎం సరిరాంనాయక్, ఆదిలాబాద్ ఆర్ఎం సాల్మన్, నిజామాబాద్ ఆర్ఎం జాన్‌రెడ్డి, వరంగల్ రీజియన్ డిప్యూటీ ఆర్ఎంలు కేశారాజు భానుకిరణ్, మాధవరావు, అకౌంట్స్ మేనేజర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు వ్యాగన్‌లో పొగలు


● ఉప్పల్‌లో నిలిపి ఆర్పివేత



ఫైరింజన్‌తో పొగలు ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కమలాపూర్: బొగ్గు తరలిస్తున్న గూడ్స్ రైల్లోని ఓ వ్యాగన్‌లో బుధవారం పొగలు రావడంతో రైలును హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్ రైల్వేస్టేషన్‌లో నిలిపి వేసి ఫైరింజన్ సాయంతో ఆర్పివేశారు. స్థానికుల కథనం ప్రకారం.. మందమర్రి నుంచి కర్ణాటకకు గూడ్స్ రైలులో బొగ్గు తరలిస్తుండగా మార్గమధ్యన పొత్కపల్లి రైల్వేస్టేషన్ దాటగానే వ్యాగన్‌లో పొగలు రావడాన్ని డ్రైవర్, గార్డు గమనించారు. గూడ్స్ రైలు ఉప్పల్ వద్దకు రాగానే ఆ పొగలు కాస్త ఎక్కువ కావడంతో రైల్వే అధికారులకు తెలియజేసి వారి సూచనల మేరకు రైలును ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో హుజూరాబాద్ నుంచి అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాస్, సందీప్, శివారెడ్డి, ప్రభాకర్ వచ్చి ఫైరింజన్ సాయంతో వ్యాగన్ నుంచి వస్తున్న పొగలను ఆర్పి వేశారు. గంట పాటు రైలును ఉప్పల్ స్టేషన్‌లోనే నిలిపి పొగలు రావడం లేదని నిర్ధారించుకున్న తర్వాత పంపించి వేశారు.

అనుమతి లేకుండా విక్రయిస్తున్న టపాసుల పట్టివేత



టపాసులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మడికొండ: అనుమతి లేకుండా విక్రయిస్తున్న దీపావళి టపాసులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. దీపావళి టపాసులు అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం మడికొండకు చెందిన దొంతుల సంపత్‌కుమార్, కుమ్మరిగూడేనికి చెందిన పాడెం వినయ్‌కుమార్ షాపులపై దాడి చేశారు. ఇందులో సంపత్ కుమార్ వద్ద సుమారు రూ. 1,48, 812 విలువైన టపాసులు, వినయ్‌కుమార్ వద్ద రూ.3,31,460 విలువైన టపాసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం మడికొండ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మడికొండ ఎస్సై రాజబాబు తెలిపారు.

క్రికెట్ విజేత హనుమకొండ..

● ముగిసిన అండర్–23 లీగ్ కమ్ నాకౌట్ పోటీలు



ట్రోఫీ అందుకున్న హనుమకొండ జట్టుతో అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులు కొనసాగిన అండర్–23 ఆరు జిల్లాల స్థాయి లీగ్ కమ్ నాకౌట్ క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీ సుఖాంత్ క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీల్లో హనుమకొండ, మహబూబాబాద్ జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి.టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హనుమకొండ జట్టు నిర్ణీత 20 ఓవర్లకు గానూ 9వికెట్ల నష్టానికి 122 పరుగులను సాధించింది. అనంతరం బరిలోకి దిగిన మహబూబాబాద్ జట్టు 16 ఓవర్లను ఎదుర్కొని కేవలం 64 పరుగుల వద్ద అన్నీ వికెట్లు కోల్పోయి ఓటమి చవిచూసింది. ముగింపు వేడుకల్లో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్.. విజేతకు ట్రోఫీని అందజేసి మాట్లాడారు. నవంబర్‌లో జరిగే అండర్–23 అంతర్ జిల్లాల స్థాయి క్రికెట్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ట్రోఫీని దక్కించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఉపేందర్, కార్యవర్గ సభ్యులు తోట రాము, మట్టెడ కుమార్, మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ అజయ్ సారథి, వరంగల్ జిల్లా మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభానురావు, బండారి ప్రభాకర్, వరంగల్ రంజీ క్రీడాకారుడు తోట సుఖాంత్ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌రాజ్ కాటన్ 'షోరూం' ప్రారంభం



రామ్‌రాజ్ షోరూం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి , షోరూం నిర్వాహకులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూంను బుధవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి ప్రారంభించారు. షోరూం ప్రారంభమవగానే మొదటి కస్టమర్‌గా ప్రముఖ వ్యాపారి కాసం ఓం నమఃశివాయ.. రామ్‌రాజ్ దుస్తులు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా రామ్‌రాజ్ కాటన్ షోరూం జీఎం సతీంద్రన్ నాయర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే హనుమకొండ చౌరస్తా షోరూం పెద్దదని, వివాహాది శుభకార్యాలకు సంప్రదాయ వస్త్రాలకు పెట్టింది పేరుగా ఈ షోరూం నిలుస్తుందన్నారు. దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిందన్నారు. కార్యక్రమంలో షోరూం నిర్వాహకులు ముప్పిడి విజయ్‌కుమార్‌రెడ్డి, రాంసహాయం హరీశ్‌రెడ్డి పాల్గొన్నారు.